# అసమర్థుడి రాజ్యం

విట్టకవి శ్యామలాదేవి



**సూర్యుడు** వెళ్ళిపోయాడు. పోతూ పోతూ ఆకాశం నిండా ఎఱ్ఱని కాంతి పుంజాలను స్ప్రే చేసి పోయాడు. ఎఱ్ఱటి ఆ రేడియమ్ కలర్ భూమి మీదికి కొద్ది కొద్దిగా రిఫ్లెక్స్ అవుతోంది. ఆ సంధ్య కెంజాయలకు క్రిందగా నల్లని చుక్కల్లాగా పక్షులు గుంపులు గుంపులుగా జంటలు కట్టి ఎగిరి పోతున్నాయి. ముందు నడిచే ఆవుల గిట్టల నుంచి ధూళి రేగి నీడలు కమ్మింది. ఆ మట్టి లోంచి చిన్న సువాసన !

సీతాపతి నాగలిని భుజాన వేసుకుని ఎడ్ల తాళ్ళు పట్టుకుని నిరుత్సాహంగా నడవ సాగాడు. అతని మెదడులో ఎన్నో ఆలోచనలు. ఏదో అశాంతి. అందరూ ఉండీ కూడా ఏకాకిగానే బ్రతకాల్సి వచ్చింది. సొంత పొలం ఉన్నా. పరాయి వాళ్ళ పొలం కౌలుకు చేయాల్సిన గతి పట్టింది. తన తెలివీ. సామర్థ్యం. చురుకుదనం. జాలి. దయా గుణాల వల్ల తనకు కలిగిన లాభం ఏమిటి? మంచితనం వల్ల సుఖపడక పోగా ఈ దుఃఖం. అడుగడుగునా అవమానం ఎందుకు? నీతి నియమం లేనివాడే సంతోషంగా. సుఖంగా

ఉంటున్నాడే. నియమాలు, క్రమ శిక్షణ అంటూ ఆలోచించే తన బోటి గాడికి నిత్య విచారం తప్పటం లేదే? ఎడ్లు తాళ్ళు జార్చుకుని వెళ్ళి పోడం సీతాపతి గమనించ లేదు. తన ధోరణిలో తానున్నాడు.

అసలు తనను చిన్నతనం నించీ మంచి వాడు, మంచి వాడు అని పొగిడి పాడు చేశారు. ఎందుకూ పనికిరాని చవటని చేశారు. అసమర్థుణ్ణి చేశారు. నిజమే. తను పనికిరాని వాడే. అసమర్థుడే. అయితే మాత్రం-తనలాగా లోకంలో అసమర్థులంతా అష్ట కష్టాలు పడుతున్నారా? చవటలైన వారినంతా పెళ్ళాలు తిరస్కరించారా? వీడి పెళ్ళాం వీడ్ని వదిలే సిందిరోయ్ అన్న హేళనకు గురి అవుతున్నారా? తనలాగా అన్నల చేత, తమ్ముల చేత 'నువ్వు ఊళ్ళో ఉండకు. నీ మూలంగా మాకూ అప్రతిష్ఠ వస్తుం'దని చీదరింప బడుతున్నారా? చివరికి కన్నతల్లి చేత కూడా-"నీకే కడుపు నిండా తిండి దొరికే మార్గం లేదు. నాకేం పెడతావు? నేను నీ దరిద్రం పంచుకోలేను. నాలుగు రాళ్ళు వెనకేసుకున్నాక కబురంపు, వస్తాను" అనిపించుకున్నాడు. ఇంక బ్రతికేం ప్రయోజనం? ఎవరూ మెచ్చని, ఎవరూ తోడు రాని ఈ జీవితం. ఎందుకు? ఏం సాధించాలి?

సీతాపతి ఆలోచిస్తూ తల పైకెత్తి ఆకాశాన్ని చూశాడు. ఇందాక వెళ్ళింది నల్ల పిట్టల గుంపు. ఇప్పుడు తెల్ల పిట్టల బారు పైపైకి ఎగిసి ఎగిరి పోతుంటే మల్లెల్లాంటి రెక్కల మీద సంధ్యారాగం పడి వింత సోయగాలని వెదజల్లుతోంది. ఎంతో కాలంగా విరామం లేని విషాద గీతం సీతాపతిని కుదిపి వేస్తుండగా అతని మనస్సు దృశ్యానికి ఆనందంగా పరవశించింది. ఏదో ఉత్సాహ రేఖ తరుము కొచ్చింది. చిన్న నవ్వొకటి పెదవుల మీదకి దండ యాత్ర చేసింది.

"ఏంటి, బాబుగారూ, మీలో మీరే నవ్వుకుంటున్నారు" అంటూ ఎడ్ల తాళ్ళను అందుకోడానికి చకచకా నడిచింది రాజ్యం.

"నువ్వా...రాజ్యం!" అంటూ ఉలిక్కిపడి ఆమె వంకకు చూశాడు. అతని ఆలోచన ఆగిపోయింది. రాజ్యం కళ్ళల్లో కూడా సంధ్యారాగం ప్రతిఫలిస్తోంది. ప్రకృతి రాగం చూసి పరవశించడానికి సిద్ధపడ్డ సీతాపతి మనస్సు రాజ్యం కనులలోని ఆత్మీయతకు కదిలిపోయింది.

"ఏముంది, రాజ్యం? ఆ పక్షుల్ని చూడు. అవి ఎంత కలిసికట్టుగా జీవన యాత్ర చేస్తాయో! సముద్రం మీంచి ఎగిరినా, అన్నీ కలిసి ఒక్కసారే ఎగురుతాయి. అవి ఎగురుతుంటే నాకు రకరకాల డిజైన్లు కళ్ళకి కడతాయి. ఇలా ఎగిరే పిట్టల్ని చూస్తుంటే ఎంతో హాయిగా, ఆనందంగా ఉంటుంది" అన్నాడు.

"నిజమే, బాబుగారూ! నేను కూడా అంతే. ఆ మొండి జామ చెట్టు మీద కూర్చుని ఈ వేళప్పుడు రోజూ పిట్టల్ని చూస్తుంటాను" అంది రాజ్యం మెరిసే కళ్ళతో.

ఈ పిల్లేమిటో నా వెంట పడుతుంది. ఏం చెప్పినా నేనూ అంతేనంటుంది. వద్దంటే విన కుండా తనకు వంటలో సాయపడుతుంది.

"అయితే, రాజ్యం! ఆ టిఫిన్ కారియర్‌లో ఉన్నదేమిటీ... అంత భద్రంగా పట్టికెడుతున్నావు?" అన్నాడు సీతాపతి.

"ఇదాండీ...ఇదండీ...ఇదీ...ఇదంటే నా కెంత ప్రాణమోనండీ. ఇది ఎప్పుడంటే అప్పుడు దొరికేది కాదండి. దీన్నీ, స్వర్గాన్నీ పక్క పక్కన పెట్టి నీకేది కావాలంటే నేను దీన్నే కోరుకుంటానండి" అంది.


"అబ్బ ఎంత సస్పెన్సులో పెట్టావు. ఆ టిఫిన్లో ది ఏమిటీ అంటే స్వర్గం, ప్రాణం అన్నావే గానీ అస లదేమిటో చెప్పనే లేదు కదా. నీకూ రచయిత్రి కుండవలసిన లక్షణా లున్నాయి."

రాజ్యం కిల కిలా నవ్వింది. "దీని పేరు చెప్పకూడదు. అసలు ఇదేమిటో మూడు నిముషాల్లో మీ నోట్లో ఉంటుంది. అదిగో మీ ఇల్లొచ్చేసిందిగా. ఎడ్లని నేను కట్టేస్తాను. మీరు వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కురండి" అంది.

రాజ్యం చూపుతున్న చనువుకీ, ఆప్యాయతకీ ఆమె వైపు వంగుతున్నాడు. ఇంతవరకూ తన నొక వ్యక్తిగా జమ కట్టిన వారు లేరు. ఈ రాజ్యం ఎందుకో తన కిష్టమైన దేమిటో తెలుసుకోవాలనీ, తనకు నచ్చేలా ఉండాలనీ ప్రయత్నం చేస్తోంది. ఈ అమ్మాయిని దూరంగా ఉంచాలనుకుంటూనే దగ్గరవుతున్నాడు. ఎడారి లాంటి తన మనోభూమి రాజ్యాన్ని చూడటంతోనే వసంతవన మయి పోతుంది. తను ఏకాకిననీ, తనను ఎవ్వరూ పట్టించుకోరనీ కుమిలిపోతున్న ఈ తరుణంలో రాజ్యం అభిమానంగా పలకరించేసరికి ఒళ్ళు పుల కరించి పోతోంది. ఈ భావాన్ని అదుపులో పెట్టాలి

MCA-MCS-52-TEL






అనుకున్నాడు సీతాపతి.

అయినా, ఈ రాజ్యం మాత్రం ఎన్నాళ్ళుంటుంది. వాళ్ళయ్య దానికి మనువు చెయ్యాలని తొందరపడుతున్నాడు. "పెద్దరెడ్డిగారి పెద్ద పాలిగాడు యెంకటేశు కియ్యనా? రమణయ్యగారి ట్రాక్టరు తోలే డ్రైవరు ఈరాసామి కియ్యనా? అప్పిగాడికి రాజ్యం అంటే పంచ ప్రాణాలు. ఆడు పంచాయతీ బోర్డు మెంబరు. రాజ్యం అదుట్టం బాగుంటే ఆడే చీఫ్ మినిట్టర్ గూడా అవుతాడు. కాకపోతే ఆడికి దుర్గుణాలు జాస్తిగా ఉన్నాయి. మీ సలా ఏంటి, బాబు?" అని అడిగాడు.

సీతాపతి తెల్లబోయాడు. తన కళ్ళల్లో వ్యక్తం అయిన ఆశ్చర్యం అర్థం, లేకపోయినా, తనకే తెలిసింది.

ఆ కూల నాలి చేసుకునే దౌర్భాగ్యుల్లో, మొరటు వాళ్ళల్లో, దుర్మార్గుల్లో ఒక దౌర్భాగ్యుణ్ణి, ఓ మొరటు వాణ్ణి, ఓ దుర్మార్గుణ్ణి రత్నం లాంటి రాజ్యం కోసం తను సెలక్టు చెయ్యాలా ? ఆ ముగ్గురూ ముగ్గురే- సాయంత్రం అయ్యేసరికి మానవత్వం పోయి, పశువుల్లాగా ప్రవర్తిస్తారు. తెగ తాగి పందుల్లాగా దుమ్ములో దొర్లుతారు. ఆ మాటే పైకంటే, రాజ్యం తండ్రి పడీ పడీ నవ్వాడు. పొట్ట చేత పట్టుకుని నవ్వాడు. కొంత సేపటికి తేరుకుని-"ఏంది, బాబూ, నే నేమన్నా ఉజ్జోగస్తుణ్ణా, లచ్చాధికారినా? నా కూతురికి యాళ్ళ కంటే మంచి సంబంధం ఎలా తెత్తాను, సామీ! అసలు యాళ్ళే నా చేతిని మించి పోతున్నారు. నా మీదికి ఆ కానులు గోడు పోటీకి వచ్చాడు. కానులు గోడి బొట్టి రంగి గజ్జల గుఱ్ఱమల్లే ఉంటది. నేను రొండొందలు -ఇస్తానంటే, ఆడు మరో వంద యెక్కు విత్తానని ఆళ్ళ దగ్గర, ఈళ్ళ దగ్గర అంటన్నాడంట. అయినా, సీతాపతిగోరూ, మీరింత పిచ్చోళ్ళేమిటండీ? మాలో తాగని వాళ్ళుంటం శానా గొప్ప. మారు మనువులు చేసుకోని వాడు కోటి కొక్కడు. సదూకున్నోడు కలికానికి కూడా లేడు. నేనెట్టా తెత్తానండీ రాజ్యానికి మంచోణ్ణి" అని గలగలా నవ్వాడు.

సీతాపతికి సిగ్గేసింది. ఈ నరిసిగాడు కూడా తనను పిచ్చో డంటున్నాడు. అంటే... అంటే తను నిజంగా పిచ్చి వాడేనేమో? లేకపోతే ఇంత మంది తనను పిచ్చివా డంటారా?

సీతాపతి ఎంతకీ రాకపోయేసరికి రాజ్యం పెరట్లోకి వచ్చింది. సీతాపతి ఎటో చూస్తున్నాడు. మొహం కడుక్కున్నాడు గాబోలు మొహం మీంచి బొట్లు బొట్లుగా నీళ్ళు కింద పడుతున్నయ్. సీతాపతి ఏ మాలోచిస్తున్నాడో? ఆ నీటి చుక్కల్లో కన్నీరు కూడా ఉందేమో తెలీని రాజ్యం అతను చూసే వైపు చూసింది. ఒక ఎద్దు కుడితొట్లో నీరు తాగుతోంది. రెండోది గుంజ దగ్గరున్న పచ్చ గడ్డి పరకలు మేస్తోంది. అతన్ని చూస్తే రాజ్యానికి తమాషా చెయ్యాలనిపించింది. పిల్లిలాగా చప్పుడు కాకుండా వెళ్ళి, చేత్తో నీళ్ళు తీసుకుని సీతాపతి మీదికి చిలకరించి గలగలా నవ్వింది. "ఎంత సేపు, బాబూ, మొహం కడుక్కోడం! అవతల తాయిలం మన కోసం ఏడుస్తోంది. నే చెప్పాను కదా-అదంటే నాకు ప్రాణమని. మీతో కలిసి తిందామని ఆగాను. ఎంతకీ రారేమిటి?" సీతాపతి చెయ్యి పుచ్చుకుని గబగబా పాకలోకి ఈడ్చుకు పోయింది. సీతాపతికి తువ్వాలు కనిపించలేదు. రాజ్యం తన పైట కొంగు అందించింది. "బాబూ! నా చీరతో తుడుచుకుంటున్నారు గనక పంటల్లో నాకు కొత్త చీర కొనాల్సిందే" అని చిన్న పిల్లలాగా మారాం చేసింది.

సీతాపతి హాయిగా నవ్వుకున్నాడు. మనస్సులో ఎన్నో ఊహలు. మళ్ళీ నల్ల మబ్బులు. ఊరించి ఊరించి తాయిలం పెడదా మనుకున్న రాజ్యానికి సీతాపతి మౌనం నిరుత్సాహం కలిగించింది. అయినా-"కళ్ళు మూసుకుని, నోరు తెరవండి" అంది నవ్వుతూ.

సీతాపతి ఆలోచనలు పటా పంచ లయ్యాయి. కళ్ళు మూసుకుని, "ఊ పెట్టు" అంటూ నోరు తెరిచాడు. నోట్లోకి తియ్యని అమృతం లాంటి పదార్థం వచ్చింది. 'ఓహో దీన్ని తిని ఎన్నాళ్ళయింది...ఎన్నేళ్ళయింది! ఎప్పుడో చిన్నప్పుడు తిన్నాను. ఇది నా కత్యంత ప్రియమైనదని రాజ్యాని కెలా తెలుసు? అయినా, రాజ్యం తియ్యని స్వచ్ఛమైన మనస్సు కన్న ఇదేమంత రుచికరమైనది?' అలాగే రాజ్యాన్ని దగ్గరకు తీసుకుని, ఆమె ఒళ్ళో చేరి తన బాధను వెళ్లబోసుకుందా మనుకున్నాడు సీతాపతి. చెయ్యి నడుము వరకు వెళ్ళి ఆగి పోయింది. సంస్కారం వెన్ను తట్టింది. "రాజ్యం! నా కిదంటే ప్రాణమని నీ కెల్లా తెలిసింది!" ఆశ్చర్యంగా చూశాడు.

రాజ్యం తెల్లబోయింది. "బాబుగారి దంతా వేళాకోళం. నా కిష్టమైనది మీకు పెట్టాలని తెచ్చాను గాని, మీ కిష్టమని నాకేం తెలుస్తుంది?" అంది మెరిసే కళ్ళతో. రాజ్యం తమ ఇద్దరికీ ఇష్టమైన వాటిని లెక్క పెట్టింది-వేళ్ళు ముడుస్తూ. "నాకు మల్లెలంటే ఇష్టం. మగాళ్ళయినా, మీరూ మల్లెలు విరబూసిన తోటలో గంటల తరబడి షికారు చేస్తారు. నాకు సాయంత్రాల్లో ఎఱ్ఱ కాంతిలో ఎగిరే కొల్లేటి కొంగల్నీ, మెరిసే వాటి తెల్లటి రెక్కల్నీ చూడ్డం ఇష్టం. మీకూ అంతే. నాకు బుల్లి బుల్లి బుజ్జాయి ఆవు దూడల్తో పరుగులెత్తడం ఇష్టం. మీకూ అ దిష్టమే."

"ఆ సంగతి నీ కెలా తెలుసు?"

"మొన్న మామిడి తోటలో మా నల్లావు వేసిన తెల్ల దూడతో మీరు పరుగులెత్తడం చూశా" అంటూ, నోటికి చెంగు అడ్డం పెట్టుకుని కిసుక్కున నవ్వింది.

"ఆ నవ్వెందుకు?" ఉడుక్కున్నాడు సీతాపతి.

"అప్పుడు మీరు కాలు మెలికపడి పడ్డారు కదా, బాబూ! ఆ పొగరు మోతు దూడ మిమ్మల్ని దాటుకుని వెళ్ళిపోయి మీ కళ్ళల్లోకి గర్వంగా చూసింది కదా. అప్పుడు లేచి దుమ్ము దులుపుకుంటున్న మిమ్మల్ని చూసి పగలపడి నవ్వుకున్నాను."

సీతాపతి కూడా "పెంకి పిల్లా" అంటూ ఆమె నవ్వుతో శ్రుతి కలిపాడు.

"ఊఁ. ఇంకోటి చూడండీ...నా కబద్ధా లాడటం ఇష్టం లేదు. మీకూ ఇష్టం లేదుట. మా బాబు చెప్పాడు-మీకు అబద్ధాలు చెప్పడం ఇష్టం లేక చాలా పెద్ద ఉద్యోగం వదులుకున్నారని."

"ఊఁ." నిట్టూర్పు విడిచాడు. "ఆ నిజాయితీగా ఉండాలనుకోడమే నా జీవితాన్ని తారుమారు చేసింది." బాధగా అన్నాడు.

"ఇంకా మనిద్దరికీ కలిసిన సంగతులు బోల్డున్నాయ్, బాబూ! కానీ, ఈ జున్ను కూడా మీకూ-డా నాకు మల్లేనే ప్రాణం అంటే నాకు సరదాగా ఉంది." కిలకిలా నవ్వింది.

మాటల్లో ఎవ రెంత జున్ను తిన్నారో, ఎవరెవ రెలా తిన్నారో తెలీదు. చివరికి తెల్లటి టిఫిన్‌లో ఇద్దరూ ఒక్కసారే చెయ్యి పెట్టారు. రెండు చేతులూ అందులో బొటా బొటిగా సరిపోయి ఇరుక్కుపోయాయి. రాజ్యానికి ఆ టిఫిన్ కారియర్ లోంచి చెయ్యి తియ్యాలనిపించలేదు. ఇద్దరికీ గిలిగింతగా ఉంది. రాజ్యం కావాలని చేయి బిగపట్టి బయటికి రాకుండా చేసింది. రాజ్యం అతని చేతిని గిల్లి, చటుక్కున చెయ్యి లాక్కుని లేచి నిలబడింది.

"బాబూ! అలా కారియర్‌లో చేతులు ఇరుక్కుపోడం నాకు భలే బాగా ఉంది. మీకు కూడా అంతేనా" అంటూ సిగ్గుతో నవ్వుతూ పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయింది.

సీతాపతి చాలా సేపు ఆ స్వర్గా సుఖాన్ని అనుభవిస్తూ ఆనందంలో మునిగి పోయాడు. ఆలోచనలో ఆ చేతిని తన పెదవులకు ఆనించుకున్నాడు. రాజ్యం చిలిపిగా గిల్లిన దాని కంటే జున్ను రుచి తక్కువే అనుకున్నాడు.

ఏమైనా సరే, ఎవ రడ్డమొచ్చినా సరే...రాజ్యాన్ని తనదాన్ని చేసుకోవాలనుకుని నిర్ణయం చేసుకున్నాడు. రెండు సంవత్సరాల తరువాత ఆ రాత్రే గుండెమీద చేయి వేసుకుని హాయిగా నిద్రపోయాడు సీతాపతి. రాజ్యానికి తన గతాన్ని చెప్తే ఏమనుకుంటుందో, ఏమంటుందో?

** ** **

"అందరూ నన్ను పిచ్చివా డంటారు, రాజ్యం! నా కథ విని నేను పిచ్చివాణ్ణో, కాదో నువ్వే నిర్ణయించు."

"బాబుగారూ! నాకు మీ కథ చెప్పక్కర్లేదు. మీ రెలాంటి వారో నాకు బాగా తెలుసు. రెండేళ్ళ నించీ చూస్తున్నాను. మీ దయా, జాలి, మంచితనం చాలామందికి ఉండవు. అందుకే అందరూ మిమ్మల్ని పిచ్చా డంటారు. అన్నవాణ్ణి చాచి లెంపకాయ కొట్టరు. అందుకే మీ రంటే అందరికీ అలుసు. అయినా...మీ ఊ రేమిటో, ఇక్కడికెందుకు వచ్చి పొట్ట గడుపుకుంటున్నారో చెప్పండి" అంది, చెట్టుమీది మామిడికాయ అందుకోవడానికి ఎగురుతూ. ఒక్క కాయ కొయ్యబోతే రెండు దొరికాయి. బొడ్లోంచి ఉప్పూ, కారం కల్పిన పొట్లాన్ని ఊడదీసింది. సీతాపతి వద్దన్నాడు. చాలా బాగుంటుందని బలవంతం చేసి కొరికించింది రాజ్యం.

"మా తల్లితండ్రులకు నేనే చివరివాణ్ణి. నాకు ఇద్ద రన్నలు, ఇద్ద రక్కలు."

బుగ్గకు చేతు లానించుకుని శ్రద్ధగా వింటోంది రాజ్యం.

"నేను చాలా బాగా చదివేవాణ్ణి. స్కూల్లోను, కాలేజీలోనూ నాకే ఫస్టు వచ్చేది. ఆటల్లో, పాటల్లో కూడా నాకే బహుమతులు వచ్చేవి."

రాజ్యం కళ్ళలో ఆరాధన.

"మా అమ్మా, నాన్నల ఆశలన్నీ నా మీదే. మా నాన్నకి నన్ను ఏం చదివించాలో తెలిసేది కాదు. డాక్టరైతే ఎక్కువ డబ్బొస్తుందా, ఇంజినీరైతే ఎక్కువ డబ్బొస్తుందా అని కనిపించిన వాడినల్లా అడిగేవాడు. ఈ రెండూ కాదు; కలెక్టరయితే మంచి హోదా ఉంటుంది, అధికారం ఉంటుంది అనేవాళ్ళు కొందరు. కాని, నేను మాత్రం లెక్చరర్ని అవ్వా లనుకునేవాణ్ణి. ఎక్కువమంది మెరికల్లాంటి విద్యార్థుల్ని తయారుచేసి దేశ మాతకు కానుకగా ఇవ్వాలనుకునేవాణ్ణి."

"ఇంతకీ మీ రేం ఉద్యోగం చేసేవారో చెప్పండి?" అంది రాజ్యం.

"నేను ఆశించినట్లే లెక్చరర్ని అయ్యాను. నా మీద ఎంతో ఆశపెట్టుకున్న మావాళ్ళు నిరుత్సాహపడిపోయారు. మా అమ్మ కట్నం ద్వారా అన్నా డబ్బు సంపాదించా లనుకుంది. కట్నం పుచ్చుకోనని బీదింటి పిల్లను పెళ్ళి చేసుకున్నాను. దాంతో మాఅమ్మ, మాఅన్నయ్యలు నన్ను శత్రువు కింద లెక్కగట్టారు. నా భార్యతోనైనా నేను హాయిగా జీవితం గడపొచ్చు ననుకున్నాను. కాని, ఆమెకు డబ్బు దాహం ఎక్కువ. నడమంత్రపు సిరిలాగా వచ్చిన ఐశ్వర్యానికి ఆమె కళ్ళు నెత్తి కెక్కాయి. రెండు రూపాయలు చూడని కళ్ళతో పదిహేను వందల జీతాన్ని చూస్తుండేసరికి ఆమెకు గొంతెమ్మ కోరిక లెక్కువయ్యాయి. నా జీతం పది రోజులు కూడా వచ్చేది కాదు. నేను మెల్లగా బ్రతిమాలినట్లుగా నచ్చచెప్తే చెవికెక్కేది కాదు. చిరచిరలూ, బుసబుసలూ ఎక్కువైనాయి. ఛీత్కారాలూ, ఫూత్కారాలూ లేకుండా రోజు గడిచేది కాదు. ఎలాగైనా డబ్బు గడించ మనేది. ట్యూషన్స్ చెప్పమనేది. నా స్టూడెంట్స్‌కి క్లాసులోనే పాఠాలర్థమవుతాయి. ట్యూషన్స్‌కి రారనేవాణ్ణి. క్లాసులో పాఠాలు చెప్పే ఫూల్‌ని నే నొక్కడేనని పక్కవీధిలోని తెలుగు లెక్చరర్ పెళ్ళాం చెప్పిందట. అప్పట్నుంచీ నన్నుకూడా పాఠాలు సరిగ్గా చెప్పవద్దనేది. ఒక్కనాడు కూడా మేము సంతోషంగా కాలం గడిపింది లేదు. మా మధ్య ఆర్థికమైన సమస్యలు తప్ప మరో మాట ఉండేది కాదు.

సీతాపతిని జాలిగా చూసింది రాజ్యం. "మీ లాంటివాడి నంత క్షోభపెట్టిందా? ఆవి డెంత తెలివితక్కువది" అంది.

"ఏడ్పి రాగాలు పెట్టేది. నా ఖర్మకొద్దీ చేతకాని మొగుడు దొరికా డనేది. పట్టు చీర కొనకపోతే చస్తానేది. ప్రతి తగూకి చివర చావు బెదిరింపు ఉండేది. నాకు ఇల్లు నరకం అయిపోయింది. ఆమె కోర్కెలు తీర్చడంకోసం అప్పులు చేయడం మొదలుపెట్టాను. తీర్చే మార్గం లేదు. మా అన్న

"ఇదిగో విన్నారా!
ఒక్క రోజుకూడా తప్పకుండా
స్కూలు వెళ్లినందుకు మాబాబు
ప్రత్యేక బహుమతి పొందాడు!



సెవెన్‌సీస్
చలవే ఇది!"

దీనికి, నిజంగా మెచ్చుకోవలసింది ఆమెనే. తన బాబును ఇంత చక్కగా పెంచినందుకు. అతడికి మంచి ఆహారం, ప్రతి రోజూ సెవెన్ సీస్ కాడ్ లివర్ ఆయిల్ ఇచ్చినందుకు. ఏడాది పొడుగునా మంచి ఆరోగ్యస్థితిలో ఉంచే సహజ ఉపాయం సెవెన్ సీస్. ఇది పిల్లల చక్కటి పెరుగుదలకు దోహదం చేస్తుంది. వారి పళ్లను, ఎముకలను దృఢంగా రూపొందిస్తుంది. వర్షాకాలంలో, చలికాలంలో వచ్చే జలుబు, దగ్గును నిరోధించే శక్తిని పెంపొందిస్తుంది. తల్లులు దీన్ని విశ్వసిస్తారు. పిల్లలు దీనితో పెరుగుతారు. ప్రపంచమంతటా 98 దేశాలలో డాక్టర్లు దీన్ని సిఫారసు చేస్తారు.

*సెవెన్ సీస్ కాడ్ లివర్ ఆయిల్ రెండు రూపాల్లో లభిస్తుంది : క్యాప్సూల్స్ మరియు పసందైన నారింజ రుచిల కాడ్ లివర్ ఆయిల్ ఇన్ మాల్ట్

సెవెన్ సీస్*
కాడ్ లివర్ ఆయిల్
ఏడాది పొడుగునా
ఉత్తమ ఆరోగ్యంకొరకు




CHAITRA-B CAP 31 TEL R

OBM/2193 TEL

పోరేశాడు. ఎడ్ల తాళ్ళు తప్పించేశాడు. ఊళ్ళో షావుకార్లని—"శీతాపతికి పైసా ఇచ్చినా తల లెగిరిపోతా"యని బెదిరించాడు. "నన్ను సర్వనాశనం చేశావ్. అప్పిగాడితో నీకు పోటీనా? మరో ఊరికి పోయి నల్గురికి ట్యూషన్లు నెప్పుకో" అని కరణంగారు చెప్పేసరికి శీతాపతి క్రుంగిపోయాడు.

ఉద్యోగాన్నీ, తల్లినీ, భార్యనీ వదులుకున్నప్పుడు కూడా ఇంత బాధగా అనిపించలేదు. ఊరంతా ఎదురు తిరిగి ఫో ఫో మని అన్నా సరే వెళ్ళకూడ దనుకున్నాడు. ఈ ఊరికీ, నాకూ ఏదో బంధం ఉంది. నే నిక్కణ్ణించి కదల్లేకుండా ఉన్నాను అనుకున్నాడు. అన్నం వండుకోడం కూడా మానే 'సి ఆలోచిస్తూ ఉండిపోయాడు శీతాపతి. గడ్డం పెరిగి బికారిలా అయ్యాడు.

"ఏం, శీతాపతీ, ఇంకా ఏం చూసుకుని ఈ ఊళ్ళోనే ఉండాలనుకున్నావ్? నీ దారి నువ్వు చూసుకుని నా పాక నా కిస్తే కొత్తావు నిందులో కట్టుకుంటాను" అన్నాడు కరణం.

ఇహ లాభం లేదు. కాళ్ళూ, చేతులూ కట్టి కాలవవతల పారే సేలాగా ఉన్నారు. ఏం చెప్పడానికీ నోరు రాలేదు శీతాపతికి. నంచి పుచ్చుకుని తడికె తలుపు దగ్గరి కే 'సి నీరసంగా బయలుదేరాడు. ఎక్కడికి వెళ్ళాలి? ఏం చెయ్యాలి? ఎలా బ్రతకాలి? ఆత్మహత్య చేసుకుంటే ఏం? తనలాంటి అసమర్థు డొకడు భూమిమీద లేకపోతే వచ్చే నష్టం ఏమిటి? బ్రతికీ ఎవరిని ఉద్ధరించాలి? మనిషి ముందుకు నడుస్తున్నా, మనసు మాత్రం వెనక్కే ఉండిపోతోంది. ఎవరో కళ్ళెం పట్టుకుని వెనక్కు లాగుతున్నట్లుగా ఉంది.

ఊరందరికీ అప్పిగాడి దౌర్జన్యం తెలి 'సిపోయింది. గంగిగోవులాంటి శీతాపతి బాబు కింత అన్యాయం జరిగిందా? అందరికీ ఎంతో సాయంగా ఉండేవాడు, ఊళ్ళో ఎవరికీ అక్షరమ్ముక్క రాకపోతే అందరికీ ఎన్నో వ్యవహారాలు చూ సేవాడు...ఆఖరికి చిన్న పిల్లలకి కూడా అతనంటే ప్రాణం.

కాని, ఇదేం-పని అని అప్పిగా ణ్ణెవరూ నిలదీయలేకపోయారు. మందలి స్తే వాళ్ళ పంట లేమౌతాయో, వాళ్ళ గొడ్డూ బిడ్డా ఏమౌతారో—అయినా న్యాయాన్యాయాలు చూ సేందు కా భగవంతుడున్నాడు. మన మెంత? అనుకున్నారు.

శీతాపతి వెడుతుంటే వాళ్ళకు చేతనైనన్ని దణ్ణాలు మాత్రం పెట్టారు. వాళ్ళ ప్రాణానికి శ్రీరాముడు అయోధ్యని విడిచిపోతున్నట్లుగానో, ధర్మరాజు అరణ్యవాసానికి పోతున్నట్లుగానో అన్పించింది. రెండేళ్ళలో మనందరి ప్రేమను ఎంతగా పొందాడో నన్న ఆశ్చర్యంతో కళ్ళ నీళ్ళతో గుడి సెల్లోకి పోయారు.

రాజ్యం గుండె బ్రద్దలైంది. భగ్గున మండింది. గుడి సె వెనక తడికె తీసుకుని రెండు మైళ్ళు నడిచీ పరిగెత్తీ, అలి 'సి కూర్చునీ, లేచి మళ్ళీ నడిచీ ముందు నడుస్తున్న మానవాకారాన్ని గుర్తించి—"శీతాపతి బాబూ" అంటూ ఆర్తిగా పెనవేసుకుపోయింది. "న న్నేం చే 'సిపోదా మనుకున్నారు? నే నెంతగా మిమ్మల్ని కోరుకున్నానో మీకు తెలీదా? ఇప్పుడు మిరు కనపడకపోతే తెల్లారేసరికి నా శవం ఉండేది. బాబూ! ఈ పిచ్చిదాన్ని అన్యాయం చే 'సి పోదామనుకున్నారా?" అని భోరున విలపించింది.

శీతాపతికి సంతోషంతో ఒళ్ళు తెలీలేదు. రాజ్యాన్ని దగ్గరకు తీసుకున్నాడు. ఎంతో దూరం పరిగెత్తి శ్రమపడి అల 'సిన రాజ్యాన్ని కాలవగట్టు దగ్గరదాకా చేతులతో తీసుకు వెళ్ళి, నీళ్ళు త్రాగించి సేద దీర్చాడు.

శీతాపతి ఎంతో ఆపేక్షగా తనను దగ్గరకు తీసుకున్నా రాజ్యానికి ఏదో లోపంగా అనిపించింది. 'బాబు నోరు విప్పి ఒక్క మాట మాట్లాడడేం' అనుకుంది.

ఎంతో సేపటికి శీతాపతి గొంతు పెగిలింది. "రాజ్యం...నా రాజ్యం! ఇవాళ నాకు రాజ్యం లభించింది. నేను రాజు నయ్యాను. ఏదో సామంత రాజును కాను; మహా సామ్రాజ్యం లభించిన చక్రవర్తిని. సామ్రాట్టుని. నీ చేతిని పట్టుకొని నేను ఎన్ని కష్టాలైనా చిరునవ్వుతో అధిగమిస్తాను. ఎందరు అప్పిగాళ్ళకైనా సమాధానం చెప్తాను. నీతితో, నిజాయితీతో నడిచేవారికి అన్నీ కష్టాలే ఎదురవ్వవనీ, సంతోష సామ్రాజ్యాలు లభిస్తాయనీ చాటి చెబుతాను. ఓ భగవాన్! ఓ ప్రభూ! నా నిజాయితీని మెచ్చి ఇచ్చిన ఈ రాజ్యాన్ని, ఈ రత్నాన్ని నా హృదయంలో పదిలంగా ఉంచుకుంటాను. పూజించుకుంటాను. శిరస్సున ధరిస్తాను. నా రాజ్యం...నా భాగ్యం" అంటున్న శీతాపతి కళ్ళు చందమామతో పోటీ పడి ప్రకాశించాయి. *


జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా



బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్
మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.




ఉచితం!

"హౌ టు లుక్ స్మార్ట్ అండ్ ఫీల్ కాన్ఫిడెంట్" అన్న మా చిన్న పుస్తకం కోసం వ్రాయండి. జాడీ మూత లోపలి కార్క్ తో పాటు 70 పైసల స్టాంపు జతపరిచి, ఈ క్రింది చిరునామాకు పంపండి.

హెచ్. ఎమ్. ఎమ్. లిమిటెడ్, డిపార్ట్‌మెంట్
APW, 1 భై సింగ్ రోడ్, న్యూ ఢిల్లీ-110001

OBM/5829Tel